క్లుప్తంగా

కూటమి ప్రభుత్వానికి రైతులపై చిన్న చూపు


పిన్నెంటి మహేష్

కృత్తివెన్ను: అన్ని విధాలుగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని చిన్న చూపు చూస్తోందని ఆర్టీసీ కృష్ణా రీజియన్ మాజీ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో పంటలో అపరాల సాగుకోసం 80% సబ్సిడీతో మినుములను రైతులకు అందించారన్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం కేవలం 33% సబ్సిడీతో రైతులకు విత్తనాలను పంపిణీ చేయడం రైతులపై భారం మోపడమేనన్నారు. కేజీ విత్తనాలను రూ. 140గా నిర్ణయించి సబ్సిడీ రూ. 42 రైతు వాటా రూ.98 వసూలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ విధానాలను మార్చుకొని రైతులకు ఆర్థిక చేయూతనిచ్చేలా గత ప్రభుత్వం ఇచ్చినట్లు 80% సబ్సిడీపై మినుము విత్తనాలను అందజేయాలన్నారు. మండల వ్యాప్తంగా నాలుగు ఆర్‌ఎస్‌కేలందు వీబీఎన్-8, ఎల్‌బీజీ-752, పీయూ-31 రకాలకు సంబంధించి మొత్తం 70 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో ఎస్. జెన్నీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకాత్యాయని షష్టి ఉత్సవాలు

పెడన: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో చిట్టూరి మాధవరావు తోటలో వేంచేసి ఉన్న శ్రీకాత్యాయని దేవి అమ్మవారి షష్టి మహోత్సవాలు బుధవారంతో మూడో రోజుకు చేరాయి. వారం రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో నిత్యం ఉదయం సమయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించి పారాయణాలను చదువుతున్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బందరులో హిందూ సంస్థల ర్యాలీ



మచిలీపట్నంటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) వంటి హిందూ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ సంస్థల ప్రతినిధులు, బీజేపీ నాయకులు స్థానిక కోనేరుసెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ఈ నిరసన ర్యాలీని చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



బంటుమిల్లి: స్థానికంగా శ్రీ శిరీష పీఠం స్వాముల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు భక్తులతో కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పడిపూజలో భాగంగా కొండ, మణికంఠ, కుమారిలు పాడిన భక్తిపాటలు స్వాములను భక్తి, పారవశ్యంలో ఉంచాయి. ఈ పూజ కార్యక్రమాల్లో అయ్యప్పలు, భవానీలు, శివస్వాములు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవానికి విరాళం



ఘంటసాల: గ్రామంలో సంతాన సాఫల్య స్వామిగా ప్రసిద్ధి చెందిన శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవానికి ఘంటసాల గ్రామానికి చెందిన వేమూరి రామారావు జ్ఞాపకార్థం వారి సోదరి వేమూరి రమణమ్మ రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. మాజీ ఉప సర్పంచ్ గొర్రెపాటి గోపాల కృష్ణ చేతుల మీదగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలైన గొర్రెపాటి వెంకట రామకృష్ణ(ట్రస్టీ), గొర్రెపాటి జగన్మోహన రావు, గొర్రెపాటి సురేంద్రల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ట్రస్టీ రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఘంటసాల గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 211వ కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు.

పశుగ్రాసం.. బహు ప్రియం

- రెండో పంట లేకపోవడంతో దొరకడం కష్టం
- భద్రపరుచుకుంటేనే మేలు
- గ్రాసం లేకపోతే పాల దిగుబడులు తగ్గిపోతాయి
- యంత్రాలతో కోసిన గడ్డిని సైతం భద్రపరుచుకుంటున్న రైతులు


యంత్రాలతో కోత కోసిన వరిగడ్డిని పోగు చేసుకుంటున్న రైతులు

కృత్తివెన్ను: రెండో పంట లేదని అధికారులు తేల్చి చెప్పడంతో పాడిరైతులకు కష్టాలు మొదలయ్యాయి. పంట లేకపోతే వరిగడ్డి కరువై పశువులకు గ్రాసం దొరకదు. దీంతో వారు చేసేది లేక ప్రస్తుతం ఖరీఫ్‌లో వరికోతల ద్వారా వస్తున్న గడ్డిని జాగ్రత్తగా భద్రపరుచుకుంటున్నారు. వాతావరణ మార్పులకు భయపడి అధికశాతం మంది రైతులు యంత్రాలతో వరికోతలు కోయడంతో పాడి రైతాంగం ఆ గడ్డినే పోగు చేసుకుంటున్నారు.

భారం కానున్న పాడి పోషణ..

ప్రస్తుతం గ్రామాలలో వరిగడ్డి నిల్వలు తరిగిపోయి, పాడిరైతుకు పశుపోషణ భారంగా మారింది. దీంతో ఏం చేయాలో తెలియని అయోమయంలో రైతులు తమ పశువులను అమ్మేస్తున్నారు. ఈ ప్రభావం పాల దిగుబడిపై పడటంతో ఇప్పుడు గ్రామాల్లోనే పాలు కరువైపోయాయి. గ్రామాల్లో పశుపోషకులు గ్రాసం నిల్వలు లేక ఉన్న పశువులను పోషించలేక లబోదిబోమంటున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 10,500 గేదెలు, 5200 ఆవులు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖాధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వీటి కోసం ఏటా వందల టన్నుల ఎండుగడ్డి నిల్వలు అవసరమవుతున్నాయి.

ధర ఎక్కువే..

గతంలో గ్రామాలలో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేసేవారు. ప్రతి రైతు తన వద్ద తప్పని సరిగా నాలుగు పైచిలుకు జీవాలను సాకేవారు. దీంతో గ్రామాలలో పాడికి ఎలాంటి కొరత ఉండేది కాదు. ఇప్పుడు వ్యవసాయంపై ప్రకృతి తన ప్రకోపాన్ని చూపుతూ వర్షాల రూపంలో పంటను పంటతో పాటు పశుగ్రాసాన్ని నీటిపాలు చేస్తోంది.


యంత్రాలతో కోసిన గడ్డిని ఇంటికి తరలించుకుంటున్న రైతులు

దీంతో ఎండుగడ్డి నిల్వలు పూర్తిగా లేకుండా పోతున్నాయి. గతంలో ఎండుగడ్డిని పెద్ద రైతులు అవసరం ఉన్న సామాన్య రైతులకు ఎలాంటి పైకం తీసుకోకుండా ఉచితంగా ఇచ్చే వారు. ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. ఎకరం వరిగడ్డి కొనాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరం గడ్డి సుమారు పదివేల రూపాయలు వరకు పలుకుతుందని రైతులు అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు. పాడి పరిశ్రమ బతకాలంటే పాడిరైతులకు సబ్సిడీపై తవుడు, దాణాలను ప్రతి గ్రామంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో గ్రామాలలో పశువులు కరువై కొనుక్కోడానికి కూడా పాలు దొరకని రోజులు వస్తాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఆర్థిక భారం..



రెండో పంట లేకపోవడం వల్ల పాడి రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతోంది. ప్రస్తుతం ఎకరం వరిగడ్డి కొనాలంటే దాదాపు పదివేల రూపాయలు పైనే వెచ్చించాల్సి వస్తోంది. పెరిగిన దాణాలకు తోడు గడ్డిని కూడా ఇంత ధర చెల్లించి కొనుక్కోవడం రైతులకు చాలా ఆర్థిక భారం అవుతుంది.

– కూనసాని రవి, రైతు, గాంధీనగరం

పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం..



గతంలో పాడి-పంట అనే నానుడి ఉండేది. దానికనుగుణంగానే పంటతో పాటు పాడిని కూడా గ్రామాలలో పెంచేవారు. ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటలు లేకపోవడంతో రైతులు పాడిని కూడా వదిలేస్తున్నారు. చాలా మంది తమ పశువులను అయినకాడికి అమ్ముకుంటున్నారు.

– జన్యావుల ఈశ్వర్‌లాల్‌బాబు, యండపల్లి

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, భూపరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి అమరావతి సచివాలయం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సర్వీసులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 495 గ్రామాలకు గానూ 290 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేశామని, దీనికి సంబంధించిన గ్రామసభలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూలు రూపొందిస్తున్నామన్నారు. ముందుగా రీ-సర్వే జరగని గ్రామాల్లో, సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, సర్వేశాఖ ఏడీ జోషీల తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పశువుల ఆశ్రయాలు అవశ్యం

జిల్లాలోని లంక గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు పశువుల ఆశ్రయ నిర్మాణాలు అవశ్యమని కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆమె క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విపత్తుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు ముందుకు రావటం లేదన్నారు. ఆయా గ్రామాల్లో పశువులు కలిగి ఉండటం, ఆ సమయంలో వాటిని వదిలేసి వస్తే ఏమైపోతాయోనన్న ఆందోళనతో సురక్షిత ప్రాంతాలకు రావటం లేదన్నారు. ఇందుకోసం పశువుల ఆశ్రయాలు నిర్మిస్తే బాగుంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు చిన్న నాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని, లక్ష్య సిద్ధితో జీవితంలో ముందుకు సాగాలని నగర క్రైం సీఐ కేవీఎస్ వరప్రసాద్ అన్నారు. స్థానిక చిలకలపూడి పాండురంగ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం 'నాయకత్వ లక్షణాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వరప్రసాద్ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన విషయాల్ని యథాతథంగా ఆకళింపు చేసుకొని, విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ ఉంటే భావి జీవితం ఎలా ఉంటుందో పలు ఉదాహరణలో వివరించారు. సీఐ వరప్రసాద్‌ను స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మొక్కను జ్ఞాపికగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూవీ కృష్ణమూర్తి ఉధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రైం బ్రాంచ్ ఎస్ఐ బలరామ్, ఏఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య ఆదర్శప్రాయుడు


రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


రోశయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. చిన్నా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అత్యంత విలువలు, నిబద్ధత గల నాయకుడు కొణిజేటి రోశయ్య అని కొనియాడారు. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆత్మకూరి సురేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాదరావు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నగరంలో నిర్వహించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం పైఅంతస్తులో ఉన్న శ్రీ లక్ష్మీనృసింహ సోమయాజి వైశ్య సమాజం కార్యాలయంలో సమాజం ప్రతినిధులు రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సోమయాజి వైశ్య సమాజం ప్రతినిధులు శ్రీకాకోళపు నరశింహగుప్తా, కొత్తగుండు రమేష్, తాడేపల్లి మెహర్‌బాబా, బి. హయగ్రీవ రావు, డీలర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించడమే తప్పా?

- నిరాధార ఆరోపణలతో వార్తలు రాయించడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ డైవర్షన్ రాజకీయాలపై మాజీ ఎమ్మెల్యే సింహాద్రి ఆగ్రహం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనపై పత్రికల్లో నిరాధార వార్తలు రాయిస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఓ పత్రికలో డాక్టర్ శ్రీహరిరావు హత్యలో తనకు, తన మిత్రుడికి సంబంధం ఉన్నట్టు వచ్చిన వార్తను ఆయన తీవ్రంగా ఖండించారు. డాక్టర్ శ్రీహరిరావు తనకు బిజినెస్ పార్ట్‌నర్ అని ఆయనతో తనకెంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. హత్య జరిగినపుడు తన అనుచరులతో వెళ్లి సాక్ష్యాలు తారుమారు చేసినట్టు వచ్చిన వార్తలో నిజం లేదన్నారు. గుండెజబ్బుతో చనిపోయాడని ల్యాబ్ టెక్నీషియన్ ఒకతను ఫోన్ చేసి చెబితే జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం కోసం కార్యాలయంలో ఉన్న తాను ఆఫీసు నుంచి కొంతమందితో కలసి వెళ్లామన్నారు. కిటికీలో నుంచి చూసిన తరువాత హత్యగా భావించి అక్కడకు ఎవరినీ వెళ్లనీయలేదన్నారు. ఆ సమయంలో హాస్పిటల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు ఉన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక దోపిడీ, అక్రమ బియ్యం రవాణా, మట్టి అమ్మకాలు అవినీతి అక్రమాలపై మాట్లాడుతున్నందుకు ఆ పత్రికను అడ్డం పెట్టుకుని పచ్చి అబద్ధాలు రాయిస్తున్నారని సింహాద్రి విమర్శించారు. గతంలో పవన్‌కల్యాణ్ అవనిగడ్డ వచ్చినపుడు శ్రీహరిరావు హత్య కేసు గురించి ప్రస్తావించిన సమయంలోనూ, ఈ కేసుని సీబీ సీఐడీకి ఇచ్చినపుడు తాను స్వాగతించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వమేనని, సీఐడీ దర్యాప్తునకు ఇచ్చి ఈ కేసుని వీలైనంత త్వరగా నిజాలు నిగ్గు తేల్చాలని రమేష్‌బాబు డిమాండ్ చేశారు.

రైతుల ఆందోళనను దారి మళ్లించేందుకు..

వర్షాలకు పంట దెబ్బతినడం, పండించిన పలు ధాన్యం రకాలను కొనకపోవడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్న తరుణంలో ఈ సమస్యను పక్కదారి పట్టించేందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. దివి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ ఎవరి హయాంలో హత్యలు, గొడవలు జరిగాయో క్రైం డేటా పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, ఎంపీటీసీ తోట గణేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో జూదరుల నుంచి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఏసుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేటలోని ఓ గృహంలో కొంత మంది పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేకాట శిబిరంపై దాడి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఆర్‌పేట సీఐ ఏసుబాబు సిబ్బంది శిబిరంపై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ. 90,050తో పాటు ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన పేకాట రాయుళ్లను చిలకలపూడి పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

216 జాతీయ రహదారిపై మినీ వ్యాన్ బీభత్సం


ఘటనా స్థలంలో వాహనాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామ శివార్లలో బుధవారం రాత్రి 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జత ఎద్దులకు, రెండు వాహనాల్లో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ నుంచి డెకరేషన్ సామాన్లతో భీమవరం వెళ్తున్న వ్యాన్.. అదే దారిలో వెళ్తున్న ఎద్దుల బండిని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన వ్యాన్ ఎదురుగా భీమవరం నుంచి విజయవాడ పాత టైర్ల లోడుతో వస్తున్న మరో మినీ వ్యాన్‌ను కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎద్దులకు తీవ్రగాయాలు కాగా బండి దెబ్బతింది. అలాగే మినీ వ్యాన్ డ్రైవరు కాలికి గాయమవడంతో పాటు రెండు వాహనాల్లో ఉన్న పలువురు వ్యక్తులకు స్వల్పంగా దెబ్బలు తగిలాయి. కృత్తివెన్ను మండలం, మునిపెడ గ్రామానికి చెందిన వెంగల బుల్లయ్య అనే రైతు ఎద్దుల బండితో పొలం నుంచి ఇంటికి వెళుతుండగా రోడ్డుపై ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ఇరువైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో వెళ్లి రోడ్డుపై అడ్డుగా ఉన్న డెకరేషన్ వ్యాన్‌ను స్థానికుల సహకారంతో పక్కకు తీయించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఆయన తెలిపారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైకలూరు: నిరుద్యోగ యువతీయువకుల్లో నైపుణ్యాల అభివృద్ధి కోసం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నామని కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కిషోర్ బుధవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ శిక్షణ అందిస్తామన్నారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసోసియేటెడ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ నెల 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, ఖాళీగా ఉన్న యువతీయువకులు కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో 35 ఏళ్లలోపు వారికి మూడు నెలల కోర్సును అందిస్తామని తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ ట్రైనర్ సునీల్ 62811 19575, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ప్రసాద్ 9701357315 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘంటసాలకు ఘన నివాళులు


ఘంటసాల విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న నగర ప్రముఖులు


ఘంటసాలలో అమర గాయకుడు ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రమోద్

మచిలీపట్నంటౌన్: గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన పార్కు ఆవరణలోని ఘంటసాల విగ్రహం వద్ద పలువురు అభిమానులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన వారు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) మాట్లాడుతూ స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు ఎంత గొప్ప స్థితికి చేరుకున్నా తనను ఆదరించిన వారిని మరువలేదన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి వారి మీద భక్తి భావనతో ఘంటసాల పాడిన పాటలు మనల్ని ఇప్పటికీ ఎంతో రంజింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో రోల్డ్ గోల్డ్ వ్యాపారి జి. రామబ్రహ్మం, బ్రాహ్మణ సంఘం నాయకుడు పీవీ ఫణి కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ్ల శ్రీరామచంద్ర మూర్తి, ఎం. సుబ్రహ్మణ్యం, తోట కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలలో..

ఘంటసాల: స్థానిక కళాతోరణంలోని అమర గాయకుడు ఘంటసాల విగ్రహానికి ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సంవత్సరం, ఏఎన్నార్ శత జయంతిని పురస్కరించుకుని వారికి సంబంధించిన పాటల పోటీలను ఘంటసాల కళాసమితి కార్యదర్శి పోతన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కళాకారులైన బసవయ్య, నందేటి శ్రీనివాసరావు, నందం పాండురంగారావు, వేమూరి గోపాలకృష్ణ, పిడిగే లైలేశ్వరరావు, కొల్లూరి సుబ్బారావు, వేమూరి వెంకట కృష్ణయ్య, ఉపాధ్యాయురాలు సూరగం జయలక్ష్మిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఘంటసాల జయంతి

అవనిగడ్డ: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల అందించిన గీతాలు తెలుగు చిత్రపరిశ్రమ ఉన్నంత వరకూ అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నవజీవన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కొండవీటి ఈశ్వరరావు, న్యాయవాది రామిశెట్టి వేణుగోపాలరావు తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దూసరపాలెం వాసికి జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న చందు

ఉయ్యూరు: ఉయ్యూరు మండలంలోని ముదునూరు శివారు దూసరపాలెంకు చెందిన మత్తె చందుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి డాక్టర్ అమృత రావు ఎడ్యుకేషనల్ సొసైటీ ఈ అవార్డును అందించింది. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఈనెల 3న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణకు చందు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ మేరకు అవార్డు అందజేశారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోత్స్నరావు జాతీయ అవార్డును చందుకు అందించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు, ముదునూరు వాసులు ఆయనను అభినందించారు.